క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



సిరిసిల్లటౌన్: తెలంగాణ జాగృతి సిరిసిల్ల పట్టణ కోశాధికారిగా బూట్ల మోహన్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఆడెపు లావణ్య కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, మడుపు శ్రీదేవి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, గోలి వెంకటరమణ పాల్గొన్నారు.

జాతీయ యువజన కాంగ్రెస్‌లో..



సిరిసిల్లటౌన్: డీఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, సెంట్రల్ కమిటీ సభ్యుడు గుడిసె ప్రభాకర్ శుక్రవారం జాతీయ యువజన కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలోని ఆ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జి అలువేరి కృష్ణ, అధ్యక్షుడు బి.వి. శ్రీనివాస్ ఆయనకు కండువా కప్పారు. రాష్ట్ర ఇన్‌చార్జి సురభి దివేది, అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

వేములవాడ: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకునేందుకు ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించుకోవాల్సిందేనని ఆ సంస్థ ఎండీ సజ్జనార్ డీఎంలకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆధార్‌కార్డుపై ప్రస్తుత ఫొటో ఉండాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన ఏదైన ఫొటో గుర్తింపుకార్డును తప్పకుండా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

బాధితులకు పరామర్శ



కొత్తపల్లిలో పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట: కొత్తపల్లిలో పాతూరి బాల్‌రెడ్డి తండ్రి నర్సారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. నాయకులు చక్రధర్‌రెడ్డి తదితరులున్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల చర్చి ఫాదర్ డానియల్ ఇటీవల మృతిచెందగా.. ఆయన కుటుంబసభ్యులను తంగళ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు కోడి అంతయ్య శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన జాతరగొండ మల్లవ్వ, కుర్ర బాలవ్వలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాలను వేములవాడ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రవి, అభి, కుమార్, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

వృద్ధులకు దుప్పట్లు



దుప్పట్లు ఇస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని వృద్ధాశ్రమ వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలితో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న క్లబ్ సభ్యుడు వంగల శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో దుప్పట్లు సమాకుర్చారు. క్లబ్ అధ్యక్షుడు పయ్యావుల రామచంద్రం, సెక్రటరీ నాయిని భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస మహోత్సవాలు



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 17న ఆరంభమైన ధనుర్మాస మహోత్సవాలు జనవరి 14 వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గడ్డం జితేందర్, ఉపాధ్యక్షుడు గంట వెంకటేశ్‌గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు నవీన్‌చారి తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం 6 నుంచి ఉత్తరద్వార దర్శనం, జనవరి 4న దీపోత్సవం, 9న మంగళశాసనం, 10న రేపల్లె వేడుకలు, 11న అలంకరణ సారే, 12న శ్రీగోదారంగనాథ కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

రసాభాసగా 'తంగళ్లపల్లి' సమావేశం

- పెండింగ్ బిల్లుల చెల్లింపులో ఆలస్యంపై సర్పంచ్‌ల ఆగ్రహం
- క్లియర్ చేయాలని ఎంపీపీ మానస ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన నిర్వహించగా.. రసాభాసగా సాగింది. ఐదేళ్ల పదవీకాలం మరో నెల రోజుల్లో ముగియనుందని, అయినా అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా మండల పరిషత్ 2024–25 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించగా ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదని తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. తంగళ్లపల్లి సర్పంచ్ అంకారపు అనిత మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ బిల్లులు చెల్లించలేదన్నారు. పంచాయతీరాజ్ ఏఈ సుమన్ అందుబాటులో ఉండటం లేదని, బిల్లుల చెల్లింపులో ఆలస్యమవుతోందని నేరెళ్ల సర్పంచ్ బొబ్బల మంజుల అన్నారు. బిల్లులు చెల్లించకపోతే కొత్తగా వచ్చే సర్పంచ్‌లు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అడుగుపెట్టకుండా తాళాలు వేస్తామని పద్మనగర్ సర్పంచ్ ముదారి పోచయ్య హెచ్చరించారు. సర్పంచ్‌ల ఇబ్బందులు వివరించేందుకు మాజీ మంత్రి కేటీఆర్‌ను సమయం అడిగితే స్పందించలేదని జెడ్పీటీసీ సభ్యురాలు పూర్మాని మంజుల రెడ్డి ఆరోపించారు. అంకిరెడ్డిపల్లె ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. సెస్ బకాయిల వసూళ్లలో అధికారుల తీరు సరిగాలేదన్నారు. సెస్ ఏడీ రామ్‌కుమార్ మాట్లాడుతూ.. బకాయిల వసూళ్లలో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదని తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ సుమన్ స్థానికంగా ఎంపీడీవో కార్యాలయంలో ఉండకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ఆదేశించారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపెల్లి సరస్వతి, సింగిల్‌విండో చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాల్‌రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, ఎంపీడీవో లచ్చాలు, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి, ఎంఈవో రఘుపతి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణిత మేధావి రామానుజన్‌కు నివాళి







అనుపురం స్కూల్లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, రంగంపేటలో 1729 ఆకారంలో.., గంభీరావుపేట: గణిత ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు

వేములవాడఅర్బన్: అనుపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శుక్రవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఇందులో 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులు గణిత విషయాలకు సంబంధించి అనేక ప్రాజెక్టులు రూపొందించి, ప్రదర్శించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కవిత, గణిత టీచర్ పద్మ, ఉపాధ్యాయులు శంకర్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగుండారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. పాఠశాల గణిత టీచర్‌ను సన్మానించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, కవిత, అంజయ్య పాల్గొన్నారు.

వీర్నపల్లి: రంగంపేట ఎంపీపీఎస్‌లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం జరిపారు. విద్యార్థులకు గణిత సబ్జెక్టుకు సంబంధించిన పోటీ పరీక్షలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు 1729 ఆకారంలో కూర్చొని, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హెచ్‌ఎం ప్రవీణ్, టీచర్లు మానసవీణ, దివ్యరాణి, రూప పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, గణిత విభాగం హెచ్‌వోడీ శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం జరిపారు. విద్యార్థులు 1729 ఆకారంలో కూర్చొని, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, కరస్పాండెంట్ నరేశ్, టీచర్లున్నారు.

గంభీరావుపేట: మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు గణిత సూత్రాలతో ప్రదర్శన నిర్వహించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దమ్మన్నపేట మోడల్ స్కూల్, జెడ్పీహెచ్‌ఎస్ తదితర పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు వేడుకల్లో పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం జరిపారు. గణితశాస్త్రం ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్ వివరించారు. అనంతరం గణిత అధ్యాపకులను సన్మానించి, కేక్ కట్ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ దేవరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులోని రైతుల వరప్రదాయని సింగసముద్రం ఆయకట్టుకు నీరందించే కాలువల పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. సింగసముద్రం పరిధిలోని నారాయణపూర్, సర్వాయిపల్లి, కోరుట్లపేట, రాచర్ల బొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట, కిష్టంపల్లి గ్రామాల్లోని 2200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ యాసంగి సీజన్‌లో ఆయకట్టు పరిధిలోని ప్రతీ గుంటకు నీరందించాలనే లక్ష్యంతో అధికారులు, నాయకులు ముందుకుపోతున్నారు. సింగసముద్రం నుంచి మొదట 2 కిలోమీటర్ల దూరం వరకు జేసీబీతో పూడిక తీయిస్తున్నారు. అక్కడి నుంచి ఉపాధిహామీ కూలీలో కనెక్టింగ్ కాలువల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను తొలగింపజేయనున్నారు. పూడికతీత కోసం ఆయకట్టు రైతులు ఎకరానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని తీర్మానించారు. ప్రస్తుతం రూ.వెయ్యి చెల్లించని రైతుల నుంచి ధాన్యం కాంటా వేసే సమయంలో రూ.2వేలు వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. బొప్పాపూర్ సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ వంగ బాపురెడ్డి, సముద్రం కనెక్టింగ్ కాల్వల చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్, రైతులు గోపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజుయాదవ్, విఠల్‌రెడ్డి, నారాయణరెడ్డి, సత్తయ్య, సత్యంరెడ్డి, సంతోష్‌గౌడ్, అంజయ్య తదితరులున్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'మహతి' విద్యార్థినుల ప్రతిభ



అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సిరిసిల్లటౌన్: శాతవాహన యూనివర్సిటీ వెల్లడించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో సిరిసిల్ల మహతి మహిళా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అన్ని గ్రూపుల్లో గరిష్ట మార్కులు సాధించి, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారని యాజమాన్యం తెలిపింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను కరెస్పాండెంట్ గెంట్యాల భూమేశ్, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌పై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై చర్యలు తీసుకోవాలని ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే అక్బరుద్దీన్ ఒవైసీ తన స్థాయిన మరిచి మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎంఐఎంకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరివేద కరుణాకర్ రెడ్డి, నాయిని రమేశ్, ఎలుక స్వామి, మంద లింగం, ప్రభాకర్, తిరుపతి, జమాల్, రజినీకాంత్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



కల్వర్టు వద్ద ఏర్పడిన గుంత

వీర్నపల్లి: మండలంలోని ప్రధాన రహదారుల్లో కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు కల్వర్టులకు ఇరువైపులా ఉన్న మట్టి పూర్తిగా కోసుకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో పలువురు వాహనదారులు ఆ గుంతల్లో పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి, మరమ్మతు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కేడీసీసీబీ సేవలు వినియోగించుకోండి



వీర్నపల్లి: మండల ప్రజలు కేడీసీసీబీ సేవలు వినియోగించుకోవాలని మేనేజర్ దేవరాజు కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులో ఖాతాలు కలిగినవారు తమ అకౌంట్లకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై, పీఎంజేఏవై, పీఎంఎస్‌బీవై రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ సభ్యుడు అరుణ్ కుమార్, డైరెక్టర్లు నాగేశ్వర్‌రావు, దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయ

గంభీరావుపేట: గోరింటాలలో పలువురు లబ్ధిదారులకు జెడ్పీటీసీ సభ్యురాలు కొమిరిశెట్టి విజయ శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొలుముల అంజమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పాత బ్రిడ్జి సామగ్రి వేలం వేయాలి



గంభీరావుపేట: గంభీరావుపేట–లింగన్నపేట మధ్య మానేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం సందర్భంగా పాత బ్రిడ్జిని కూల్చివేసి, ఇనుప చువ్వలను అక్రమంగా తరలిస్తున్నారని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రూ.లక్షలు విలువ చేసే సామగ్రి తరలిపోతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం మండిపడ్డారు. దానికి వేలం నిర్వహించి, వచ్చే నిధులను గ్రామ అభివృద్ధికి వెచ్చించాలని డిమాండ్ చేశారు. నాయకులు దోసల చంద్రం, ఉపేంద్ర, ప్రభాకర్, అనిల్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



కంచర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

బోయినపల్లి: తడగొండ గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రోన్ పరికరంతో పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడాన్ని వివరించారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ రమేశ్, ఎంఏవో ప్రణీత, ఎంపీవో గంగాతిలక్, ఐకేపీ ఏపీఎం, ఐసీడీఎస్, వైద్యాధికారులు, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: కంచర్ల గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఎంపీవో నరేశ్‌కుమార్ కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. కొన్నింటిని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు చూపించారు. షుగర్, బీపీ ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, క్యాలెండర్ ఆవిష్కరించారు. సర్పంచ్ పిట్టల రజిత, ఆర్‌ఐ ప్రవీణ్, జీపీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లో సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఐకేపీ సీసీ రేణుక, కళాకారులున్నారు.

గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఈ నెల 28 నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లోనే జరుగుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వమే ప్రజల వద్దకు వస్తుందన్నారు. గృహ నిర్మాణాలు, రేషన్‌కార్డులు తదితర అంశాలపై గ్రామస్థాయిలో సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు లింగంగౌడ్, చెన్ని బాబు, దేవేందర్‌యాదవ్, మల్లారెడ్డి, దేవయ్య, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

పేదరికం.. ఆర్థిక సమస్యలు

- ఇటీవల పప్పులో పడి ఒక కొడుకు మృతి
- మరో కొడుకు పోషణకు ఇబ్బందులు
- కడు పేదరికంలో గిరిజన కుటుంబం
- ఆర్థికసాయం చేయాలని వేడుకోలు



ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్ శంకర్‌నాయక్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారం గ్రామానికి చెందిన ముడావత్ విఘ్నేశ్(5) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు వేడి పప్పులో పడి ఇటీవల మృతిచెందాడు. నిరుపేదలు కావడంతో ఆ కుటుంబాన్ని పలువురు దాతలు ఆర్థికసాయంతో ఆదుకుంటున్నారు. మహాత్మా జ్యోతిబాపూలే స్కూల్ సిబ్బంది రూ.66,500 ఆర్థిక సహాయం చేశారు. గుండారం సర్పంచ్ శంకర్‌నాయక్ రూ.2 వేలు అందించారు.

ఆదుకోవాలని కోరుతున్న గ్రామస్తులు

రాచర్లగుండారం గ్రామానికి చెందిన రజిత–సురేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు విఘ్నేశ్, వరుణ్‌తేజ. రజిత సిరిసిల్లలోని మహాత్మాజ్యోతిబాపూలే విద్యాలయంలో వంటమనిషిగా పని చేస్తుంది. ఇటీవల తన వెంట పెద్ద కొడుకు విఘ్నేశ్‌ను స్కూల్‌కు తీసుకెళ్లి వంట పనిలో నిమగ్నమైంది. అయితే అప్పుడే ఉడికిన వేడి పప్పులో పడటంతో ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదం నుంచి ఆ కుటుంబం తేరుకోలేకపోతోంది. కడు పేదరికం అనుభవిస్తున్న గిరిజన కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని గుండారం గ్రామస్తులు కోరుతున్నారు. నిత్యం కూలీ పనులకు వెళ్తేనే పూట గడిచే పరిస్థితి ఉండటంతో రెండో కుమారుడి చదువు, పోషణ కోసం ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. దాతలు 79891 47086 నంబర్‌లో ఫోన్‌పే, గూగుల్ పేకు ఆర్థికసాయం పంపించాలని ఆ గిరిజన దంపతులు వేడుకుంటున్నారు.

పీవీ రావు, కాకా వర్ధంతి



గంభీరావుపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

గంభీరావుపేట: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు, మాజీ కేంద్ర మంత్రి, దివంగత జి.వెంకటస్వామి(కాకా) వర్ధంతిని శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బిట్ల శివ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల అంబేడ్కర్ చౌక్‌లో శుక్రవారం పోతుల విఘ్నేశ్వర్‌రావు(పీవీఆర్), గడ్డం వెంకటస్వామి(కాకా) వర్ధంతిని మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాలుక సత్యం, జిల్లా అధ్యక్షుడు రొడ్డ రాంచంద్రం, నీరటి శ్రీనివాస్, నాయకులు సక్క పర్శరాములు, పండగ శేఖర్ మంగ కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాలు

పారామెడికల్ అసోసియేషన్..



సిరిసిల్లటౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ సిరిసిల్ల పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా కుడిక్యాల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా అలువాల ఈశ్వర్, కోశాధికారి జడల అశోక్ ఎన్నికయ్యారు. వీరిని రాష్ట్ర, జోనల్, జిల్లా నాయకులు బెజ్జంకి రవీందర్, మిట్టపల్లి రాజమౌళి, శ్రీనివాసమూర్తి, దాసి రాజమల్లు అభినందించారు.

ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్



ఎమ్మెస్పీ జిల్లా కమిటీ, ఎమ్మార్పీఎస్ అడ్‌హక్ కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడిగా ఖానాపురం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా బొల్లారం చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా గుండ్రేటి రాజు, వడ్లూరి రాజు, ఆవునూరి లచ్చన్న, కార్యదర్శులుగా పుత్తూరు రాజం, తాండ్రాల తిరుపతిలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా ఎలగందుల భిక్షపతి, కోకన్వీనర్లుగా నేరేళ్ల శ్రీనివాస్, పసుల కమలాకర్, పసుల బెన్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్..



వేములవాడఅర్బన్: ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ వేములవాడ పట్టణ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మశెట్టి రాజు, ఉపాధ్యక్షులుగా లిక్కిడి జితేందర్, సరిపెల్లి కార్తీక్, అచ్చ వినోద్, క్యాషియర్లుగా అనుముల బాలయ్య, బుర్ర ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా దుర్ముట్ల వెంకటరెడ్డి, కార్యదర్శులుగా శ్రీరాముల కల్యాణ్, సార్ల చారి, చొప్పరి భాస్కర్, గౌరవ అధ్యక్షులుగా గన్నమనేని రామారావు, నరాల శేఖర్, ముఖ్య సలహాదారులుగా బింగి మహేశ్, కొయినేని బాలయ్య, మత్రిపల్లి మల్లేశం, రామతీర్థం అంజయ్య ఎన్నికయ్యారు.